

# రోగాలు - అనురోగాలు

## - డా.కె.వివేకానంద మూర్తి



*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*




**ప్రాణం పోసుకుంటున్న** పగటి వెలుగులా 'క్యూర్' హాస్పిటల్ దీపాలు నీరసంగా వెలుగుతున్నాయి. మందాకిని మందగమనంలా నడుస్తోంది. మంచాలమీద రోగులు వెల్లకితలా పడుకుని వున్నారు. బాలరాజు అవాల్టి పోస్ట్ ఆపరేటివ్ పేషెంట్సుని చూస్తున్నాడు.

'డాట్టారూ! యున్నారా?' అంది మందాకిని.

'ఏవిటి వినడం?' అడిగాడు బాలరాజు.

'నాగదాసు దొరికాట్ట'

'ఎక్కడ?'

'యారాడ కొండ దగ్గర తారాడుతూంటే పోలీసోల్లు అట్టుకున్నార్ర.'

'అలాగా'

'ఆన్నట్టుకుని సేనా రోజులైంది. కేసుకూడా నడిచింది.'

'ఏం కేసు.'

'ఇంకేటుంటది. ఆడి పయోగాలకి పేసెంట్లు పొయ్యారుగదా - అదేదో అసంకలిపిత హత్య కేసు. ఆణ్ని మూసేసారు. అగితే లైపివ్వనేదు. మూన్నాలుగేల్లుంటాడేమో'

'చాలు. ప్రజలకి మంచి జరిగింది.'

'ఆడి పొగరు యిరిగింది.'

'అలాంటివారి గురించి ఆలోచనలు మానేద్దాం. మనుషుల ఆరోగ్యం కోసం కష్టపడి పనిచేద్దాం'

'అద్గదీ.. తవరేం సెప్పినా నాటుకునేలా సెప్తారు,' అని మందాకిని ముందుకి నడిచింది.

అవాళ రేఖ హాస్పిటల్ నుండి త్వరగానే యింటికి వెళ్లిపోయింది. యింటిపనులు చూసుకోడానికి.

నాగదాసు సంగతి విన్నాక బాలరాజుకి తల్లీ, తండ్రీ గుర్తొచ్చారు. వయసు పెరుగుతున్నా తను పుట్టిన వూరిలో వారు క్షేమంగా ప్రశాంతంగా వున్నారు. తను యీ యేడాది రెండుసార్లు వెళ్లి చూసొచ్చాడు. అక్కడెందుకు, విశాఖ వచ్చేసి తనతోపాటు వుండమని మరీ మరీ చెప్పాడు. కానీ తమకు అక్కడ బావుందనీ యిప్పట్లో కదిలే ఆలోచన లేదనీ అన్నారు. బాలరాజుని పెళ్లి చేసుకోమని చాలాసార్లు చెప్పారు. త్వరలోనే చేసుకుంటానని బాలరాజు వారికి హామీ యిస్తూనే వున్నాడు. మంత్రిగారు భానూరావు కూడా రెండూ మూడుసార్లు అడిగారు. పనిలో నిమగ్నమైన బాలరాజుకి మాత్ర తొందరేం అనిపించటంలేదు. అప్పుడప్పుడు రేఖ మాత్రం అనేది - రిలీజు వాయిదాపడుతున్న సినిమాలాగా యెప్పుడు మరీ - అంటూ.

ఇద్దరూ హాస్పిటల్‌లో రోగులకు సదుపాయాలు చికిత్సా విధానాలు అభివృద్ధి చెయ్యడంలో యెప్పుడూ తీరికలేకుండానే వుంటున్నారు. ఇంట్లో మనిషిలాంటి హిస్టరీ మేష్టారు, బాలరాజు, రేఖ వాళ్ల భవంతిలోకి మారి నిజంగా యింట్లో మనిషైపోయారు. పాహియాన్ టేకవేలు తింటూ చాముండేశ్వరి కాస్త వొళ్లు చేసింది. తానీషా, హసీనా బేగం ఆ మధ్యనే యుకె వెళ్లారు. అక్కణ్నించి అడపాదడపా బాలరాజుని తానీషా పలకరిస్తూనే వున్నాడు. మిగతా స్నేహితులంతా తలో చోటికీ చెదిరిపోయారు. నెలలు యేళ్లవుతున్నాయి.

అవాళ ఆత్మీయులందరినీ యింటికి భోజనానికి పిలిచారు బాలరాజు, రేఖ.

'ఏవిటి విశేషం?' అని అడిగాడు పాహియాన్. 'తానీషా, హసీనా బేగం యు.కె నుంచి హాలీడేకి వచ్చారు. మనందర్నీ చూడాలని యెంతో ఆరాటంగా వున్నారు' అని చెప్పాడు బాలరాజు.

బాలరాజు, రేఖ తమ గృహానికి 'అనుగ్రహం' అని పేరు పెట్టారు. మిత్రబృందం అంతా అనుగ్రహం మేడమీద పెద్ద టేబుల్ చుట్టూ కూర్చున్నారు. నల్ల తంబి హుషారుగా నల్లభీమపాకాలు రకరకాలు వండి రెడీ చేశాడు.

'చెప్పవయ్యా తానీషా - ఏవిటి మీ లండన్ విశేషాలు?' అనడిగారు హిస్టరీ శర్మగారు.

'ఈ మధ్య వొక నాలుగురోజులు బాగా యెండకాసింది. అదే విశేషం. అంతకుమించి రోగాలు రొచ్చులు మామూలే'

'మరి వైద్య వసతులు యెలావుంటాయి?'

'అక్కడ అందరికీ వైద్యం ఫ్రీ. పేషెంటుకి ప్రయారిటీ యెక్కువ. డాక్టర్లకి ఎక్కౌంటబిలిటీ వుంటుంది. ఎవరిష్టం వచ్చినట్టు వాళ్లు వైద్యం చెయ్యడానికి వీల్లేదు.'

'బావుంది - మన దేశాన్ని తగలెట్టి వాళ్ల దేశాన్ని బాగానే చూసుకుంటున్నారన్నమాట.'

'వాళ్లు మనల్ని తగలెట్టిందేముంది లెండి. అన్నీ మనమే చేసుకుంటున్నాం.' అన్నాడు తానీషా.

'అదీ నిజమే. వాళ్లు పరాయి దేశాన్ని దోచుకుని తమ దేశాన్ని బాగుచేసుకుంటారు. మనవాళ్లు సాటివాణ్ని దోచుకుని పరాయి వాడికి వూడిగం చేస్తారు. ఈ మాట హిస్టరీలోనే ఘోషిస్తోంది.' అన్నారు శర్మగారు.

'అయినా మనోల్లకి వల్లమాలిన తెల్లమోజెక్కువండి' అంది చాముండేశ్వరి.

'అన్నట్టు నీకు చాముండేశ్వరి తెలుసా. మన హాస్పిటల్‌కి ఎడ్మినిస్ట్రేటివ్ యిన్ ఛార్జి' బాలరాజు తానీషాకి చాముండేశ్వరిని సముచితంగా పరిచయం చేశాడు.

'ఓసారెప్పుడో చూసినట్టు గురుతు. ఇక మరిచిపోయే ప్రసక్తే లేదు, నమస్తే చాముండేశ్వరిగారూ' అన్నాడు తానీషా.

'బలేటోరే, నన్ను సాము అనండి సాలు. మీ గుర్చి మా పావియాను సానా మాట్లు సెబుతాడు. ' నవ్వుతూ అంది చాముండేశ్వరి.

మందాకిని ముందుకి వొంగి 'కసింత కూరేసుకోండి - సేనా బాగుంది' అంటూ శర్మగారికి కూర వొడ్డించింది. ఆమె వంగినప్పుడు వుబికి వూరెత్తిస్తున్న ఆమె హృదయసంపద. వయసు పెరిగిన శర్మగారికి వెళ్లిపోయిన యవ్వనాన్ని గుర్తుచేసింది. ఆయన అడిగారు ' నీ మొగుడేం చేస్తాడమ్మాయ్' అని.

'మొగుడా - మొద్దులా - నాకుంటేగా' మందాకిని ఆగి అంది. 'మీరు బావున్నారు - నన్నుగాని సేసుకుంతరేటి?"

"ఓసి నీ యిల్లు బంగారం కానూ - ముసిలిపీనుగుని నీకు నేనే దొరికానా' అన్నారు శర్మగారు.

'హౌ ఎబౌట్ - గోయింగ్ ఫర్ ఎ వాక్ - విశాఖపట్నం వీధుల్లో నడిచి చాలారోజులైంది' అన్నాడు తానీషా.

'బావుంది సజెషన్. రండి - అంతా సరదాగా అలా కె.జి.హెచ్ వేపునడుద్దాం. నేను అప్పలరాజు కిల్లీ కొట్టు దగ్గర వుప్పు చెక్క, యాలకల పండు కిల్లీ కట్టించుకుంటాను' అన్నారు శర్మగారు.

అంతా రోడ్డెక్కారు. వెన్నెల పుచ్చపువ్వులా వుంది. రోడ్లమీద జనం యింకా తగ్గలేదు. జగదాంబా థియేటర్లో యేదో కొత్త సినిమా, ప్రేక్షకులు హాలు ముందు గుంపులుగా వున్నారు. కె.జి.హెచ్ వోపీ గేటు దగ్గర రోడ్డుమీంచి సైకిల్ రిక్షాలు వేగంగా యెల్లమ్మ తోటవేపు జారుతున్నాయి. అందరూ కబుర్లు చెప్పుకుంటూ కలెక్ట్రాఫీసు జంక్షన్ చేరారు. శర్మగారు అప్పలరాజుకి కిల్లీ పురమాయించారు. కొట్టుముందుగా వున్న బెంచీమీద యిద్దరు ముగ్గురు కూచున్నారు. అజంతా హోటల్ ముందున్న బస్‌స్టాప్‌లో వ్యక్తులు వాళ్లని చూసి గుర్తుపట్టినట్టుగా గుసగుసలాడుకుంటున్నారు.

'మన వొయిజాగులో యీ సెచ్చ యింకేడ దొరుకుద్ది' అంది చాముండేశ్వరి.

'లక్షలు ఖర్చుపెట్టినా లండన్‌లో కూడా దొరకదు' అన్నాడు తానీషా.

'అలా కోస్టల్ బేటరీ వేపు బీచ్‌లోకి నడుద్దావేవిటి?' అన్నాడు పాహియాన్.

'వద్దు - చూశారా - పైన చంద్రుణ్ని మబ్బులు కమ్మేస్తున్నాయి. వెన్నెల పోయి వర్షం కురిసినా కురవొచ్చు - అన్నారు శర్మగారు.

'అయితే - అంతా వెనక్కే నడుద్దాం మరి' అన్నాడు బాలరాజు.

మళ్లీ అంతా తిరుగు ముఖం పట్టారు. కె.జి.హెచ్ ఎంట్రీ గేట్ దాటారు. పేవ్‌మెంట్ పక్కనే రెండు పాత టాక్సీలు పార్క్ చేసి వున్నాయి. అంతలోనే సన సన్నగా చినుకులు పడటం ప్రారంభించాయి. వెన్నెల సన్నగిల్లి మసక చీకటి మసి చల్లినట్టు అలుముకుంటోంది.

'తడిసిపోతావేమో - టాక్సీలో వెళ్దామా' అన్నాడు తానీషా.

'బలేవాడివే. అవి శవాల టాక్సీలు. ఎక్కితే తిన్నగా చావులమదుంకి తీసుకుపోతాడు' అన్నాడు బాలరాజు.

'పోనీ రిక్షాలు పిలిస్తే' అంది రేఖ.

'ఎందుకండి రేకమ్మగారూ - అప్పుడప్పుడు యిలా కుసింత తడిత్తే పేనం హాయిగా వుంటది' అంది మందాకిని. చినుకులకీ, నేలకీ అడ్డమొస్తూ అక్కడే నిలబడి వాళ్లు మాట్లాడుకుంటున్నారు. ఇంతలో వొక టాక్సీ డ్రైవరు వాళ్ల దగ్గరకొచ్చి - 'శవాన్ని డిశ్చార్జ్ చేసేసినారా బాబూ - రండి - నాబండి రెడీ' అన్నాడు. ఆ డ్రైవర్ ముఖం బాగా నల్లగా వుంది. మాసిన గడ్డం అతడి ముఖాన్ని మూసేసింది.

ఎవరా వెనుకనుంచి మాట్లాడుతున్నారని బాలరాజు యిటు తిరిగి చూశాడు. డ్రైవర్ ముఖం యెక్కడో చూసినట్టుంది. బాలరాజుని చూడగానే ఆ డ్రైవర్ వెంటనే తలదించుకుని వెనక్కి తగ్గాడు. అతడే నాగదాసు అని గుర్తుపట్టడానికి బాలరాజుకి యెంతోసేపు పట్టలేదు.

శవాన్ని తీసికెళ్లడానికి బండిలో పెట్రోలుందా?' అనడిగాడు పాహియాన్.

'లేదండి. బేరం కుదిరాక అడ్వాన్స్ తీసుకుని అల్లదిగో యెల్లమ్మతోట బంకులో కొట్టించుకుంటానండి - అని సమాధానమిచ్చాడు పక్కనున్న మరో టాక్సీ డ్రైవరు.

'మేం శవం కోసం రాలేదులే' అన్నారు శర్మగారు.

'నడవండి' అన్నాడు తానీషా.

మరికాస్త వెనక్కి తగ్గి, వొక్కసారి తలెత్తి చూశారు . శవాల టాక్సీ తోలే డ్రైవర్ నాగదాసు.

బాలరాజు, రేఖ అరక్షణం అతడిని చూసి వెనక్కి తిరిగారు. వాళ్ల చూపులో వాళ్ల భావాలు వాళ్లకే తెలుసు. ఆ చూపు తన గుండెలోకి దిగి మండుతూ వుండిపోవడం నాగదాసుకే తెలుసు.

చినుకులు తగ్గాయి. మసక చీకటి మసి తొలిగిపోయింది. వెన్నెల విశాఖపట్నం అంతా పాల సముద్రంలా విస్తరించింది.

***(సమాప్తం)***

Post your comments

